

**యువతకు బాసట..**
రాష్ట్ర ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించనుంది. 8లో▶



**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| శని : 6:23 | ఆది : 5:02 |

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం 36.0/23.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా, అక్కడక్కడా పూర్తిగా మేఘావృతమవుతుంది.

## అనారోగ్యంతో పరీక్షకు..



విద్యార్థినికి చికిత్స అందిస్తున్న వైద్యుడు

గుడిహత్నూర్: మండలంలోని ధనోరా (బి) జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ప్రతీక్ష పచ్చకామెర్లతో బాధపడుతోంది. శుక్రవారం నిర్వహించిన మొదటి పరీక్షకు హాజరు కాగా, కాసేపటికే అస్వస్థతకు గురైంది. గుర్తించిన ఇన్విజిలేటర్ వెంటనే సీఎస్ దేవిదాస్‌కు తెలిపారు. దేవిదాస్ ఎస్సై మహేందర్‌కు తెలుపగా అతడు మండలవైద్యాధికారి శ్యాంసుందర్‌కు సమాచారమిచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న వైద్యాధికారి ప్రతీక్షకు ప్రథమ చికిత్స చేశారు. కాసేపటికి కోలుకున్న ఆమె తిరిగి పరీక్ష రాసింది. అనంతరం ఆమెను పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు రాయవచ్చని వైద్యుడు సూచించారు.



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమంలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా



## 'పది' పరీక్షలు ప్రారంభం

- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు పరీక్షకు 10,022 మంది విద్యార్థులు హాజరు కాగా, 32 మంది గైర్హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 10,043 మందికి 10,013 మంది హాజరు కాగా, 30 మంది గైర్హాజరయ్యారు. 99.70 శాతం హాజరు నమోదైంది. ప్రైవేట్ విద్యార్థులు 13 మందికి గాను 9 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. 81.82 శాతం హాజరు నమోదైంది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్న విద్యార్థులను సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాజర్షిషా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాల, గజిటెడ్-1 పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ పలు కేంద్రాలను పరిశీలించి బందోబస్తులో ఉన్న సిబ్బందికి సూచనలు చేశారు. డీఈవో ప్రణీత, స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేయగా మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.



జిల్లా కేంద్రంలోని గజిటెడ్-1 పాఠశాలలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

## న్యూస్‌రీల్

### ఇసుక రీచ్‌లను గుర్తించాలి

- కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: ఆయా మండలాల్లోని ఇసుక రీచ్‌లను గుర్తించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జైనథ్, భీంపూర్, బేల, సాత్నాల, భోరజ్ అధికారులతో మాట్లాడి స్థానిక ఇసుక అవసరాల గురించి తెలుసుకున్నారు. తహసీల్దార్లు రీచ్‌లను గుర్తించి ఇస్తే గ్రౌండ్ వాటర్, ఏడీ మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కలిసి ఎంత ఇసుక ఉంది, స్థానిక అవసరాలకు ఎంత వాడుకోవచ్చనే వివరాలను నివేదిక రూపంలో త్వరగా పంపాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్, ఏడీ మైన్స్, డీడీ గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్ పెన్‌గంగ అధికారులు పాల్గొన్నారు.

### కాలినడకన గంగమ్మ చెంతకు..



గంగనీళ్ల కోసం వెళ్తున్న గ్రామస్తులు

సిరికొండ: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామస్తులు భీమన్న దేవుడి పండుగకు అవసరమైన గంగనీళ్ల కోసం శుక్రవారం కాలినడకన సోన్ వద్దకు డప్పుచప్పుళ్ల మధ్య వెళ్లారు. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతనం గంగనీళ్లతో గ్రామానికి చేరుకున్నారు. భీమన్న పండుగను గంగనీళ్లతోనే జరుపుకోవడం పూర్వం నుంచే ఆనవాయితీగా వస్తోందని నాయక్‌పోడ్ కులస్తులు తెలిపారు.

### టీపీబీవోగా సాయికృష్ణ



తన తండ్రితో కలిసి కమిషనర్ సీవీఎన్ రాజుకు రిపోర్ట్ చేస్తున్న సాయికృష్ణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ (టీపీబీవో)గా జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన అంగునూరి సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఎస్.దేవేందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సాయికృష్ణ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును ఆయన కార్యాలయంలో కలిసి రిపోర్ట్ చేశారు. కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి తనను తాను పరిచయం చేసుకున్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది.

### దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 22 నుంచి 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గణితం, ఇంగ్లిష్, కంప్యూటర్ (ఐసీటీ) ఎడ్యుకేషన్‌లో, ఉర్దూ మీడియంలో లెక్చరర్ ఇన్ ఫౌండేషన్ కోర్సులు బోధించే పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంపికైనవారు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు. డెమో విధానం ద్వారా ఎంపిక చేయనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు డైట్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

# సర్కారు స్కూళ్లపై సర్వే





- జిల్లాకు రానున్న ఎస్‌సీఈఆర్టీ టీం
- 30 పాఠశాలలు తనిఖీ చేసే చాన్స్
- విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనకే..
- ప్రభుత్వానికి పంపనున్న నివేదికలు
- వెల్లడి కానున్న బోధన సామర్థ్యాలు

**జిల్లాలోని పాఠశాలల సమాచారం**

| | |
|---|---|
| ప్రాథమిక పాఠశాలలు | 477 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | 112 |
| ఉన్నత పాఠశాలలు | 120 |
| కస్తూర్బా పాఠశాలలు | 18 |
| ఆదర్శ పాఠశాలలు | 6 |
| యూఆర్‌ఎస్ పాఠశాలలు | 1 |

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల విడుదలైన పలు సర్వేల్లో విద్యాప్రమాణాలు తగ్గిపోతున్నట్లు తేలడంతో ఫోకస్ పెట్టింది. ప్రైవేట్, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరగడం, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గడంతో చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పాఠశాలల్లోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు రాష్ట్ర వి ద్యాపరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్టీ) బృందాలను పంపుతోంది. జిల్లాకు డాక్టర్ ఎల్లయ్య, స్టాలిన్‌బాబును నియమించింది. వారానికి రెండురోజుల పాటు వీరు జిల్లాలో పర్యటించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందించనున్నారు. దీంతో సర్కారు బడుల్లో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల పనితీరు తేటతెల్లం కానుంది. ఇప్పటికే మంచిర్యాల జిల్లాలో ఎస్‌సీఈఆర్టీ బృందం తనిఖీలు చేపడుతోంది. త్వరలో ఆదిలాబాద్ జిల్లాలోనూ తనిఖీలు చేపట్టనున్నారు.

**సర్కారుకు తనిఖీ నివేదికలు**

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలను ఎస్‌సీఈఆర్టీ బృందం సభ్యులు డాక్టర్ ఎల్లయ్య, స్టాలిన్ బాబు తనిఖీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 100 పాఠశాలలను తనిఖీ చేయనుండగా, ఆదిలాబాద్ జిల్లాలో 30 స్కూళ్లను తనిఖీ చేయనున్నట్లు సమాచారం. జిల్లాలో 477 ప్రాథమిక పాఠశాలలు, 112 ప్రాథమికోన్నత పాఠశాలలు, 120 ఉన్నత పాఠశాలలున్నాయి. 18 కేజీబీవీలు, ఆరు మోడల్ స్కూళ్లతోపాటు యూఆర్‌ఎస్ పాఠశాల ఉంది. ఈ పాఠశాలల్లో 65వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఎస్‌సీఈఆర్టీ బృందం ప్రస్తుతం పాఠశాలల్లో అమలు చేస్తున్న యాక్షన్ ప్లాన్, సిలబస్, ల్యాబ్‌ల నిర్వహణ, అంతర్గత మూల్యాంకన విధానం, విద్యార్థుల సామర్థ్యాలు, బోధన తీరు, మౌలిక వసతులపై నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేయనున్నారు.

**ప్రమాణాలు పడిపోవడంతోనే..**

ఆదిలాబాద్ జిల్లా అక్షర క్రమంలో ముందున్నప్పటికీ విద్యారంగంలో వెనుకబడినట్లు చెప్పవచ్చు. సర్కారు బడుల్లో 50శాతం మంది విద్యార్థులకు చదవడం, రాయడం రావడం లేదు. చతుర్విధ ప్రక్రియలు చేయలేకపోతున్నారు. న్యాస్ నివేదికలో ఇదివరకే జిల్లా పరిస్థితి స్పష్టమైన విషయం తెలిసిందే. తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఇటీవల ఆసర్ సర్వేలోనూ విద్యాప్రమాణాల పరిస్థితి దారుణంగా పడిపోయినట్లు తేలింది. ప్రభుత్వం మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలు చేపట్టినప్పటికీ అనుకున్న స్థాయిలో సర్కారు బడుల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడడంలేదని పరిశీలకులు చెబుతున్నారు. అయితే ఎస్‌సీఈఆర్టీ బృందం సర్వే తర్వాత వచ్చే విద్యాసంవత్సరంలో సర్కారు బడుల పరిస్థితి మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోనుంది. మౌలిక వసతులు కల్పించి సర్కారు బడులను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

**ప్రమాణాలు తెలుసుకునేందుకే..**



ఎస్‌సీఈఆర్టీ బృందం జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు సమాచారం ఉంది. జిల్లాలోని యూపీఎస్, పీఎస్, ఉన్నత పాఠశాలలను బృందం సభ్యులు తనిఖీ చేసి విద్యాప్రమాణాలు తెలుసుకోనున్నారు. విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. గతం కంటే విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయి. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు చేపడతాం. ఎస్‌సీఈఆర్టీ బృందం ఎప్పుడు తనిఖీ నిర్వహిస్తుందనే విషయంపై సమాచారం లేదు. – **ప్రణీత, జిల్లా విద్యాధికారి**

## ప్రత్యేకత చాటుకుంటారా?

- కొత్త ఎస్పీపై పోలీస్‌శాఖలో చర్చ
- అన్ని విభాగాల్లో ప్రక్షాళనపై దృష్టి
- క్షేత్రస్థాయికి వెళ్లి పట్టు సాధిస్తూ.. ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం



ఎస్పీ అఖిల్ మహాజన్

సాక్షి, ఆదిలాబాద్: పోలీస్ శాఖలో ఒక్కో అధికారిది ఒక్కో తీరు. కొత్తగా వచ్చినవాళ్లలో.. వ్యవస్థను పాత పద్ధతిలోనే కొనసాగిద్దాం.. కొత్తగా మార్పులెందుకు.. దాన్నే గాడిలో పెడదాం.. అనుకునే వారు కొందరు. అలాగే ఎవరెన్ని చెప్పినా విన్నట్లే విని.. సొంత స్టైల్‌ను ఫాలో అయ్యేది మరికొందరు.. ఈ రెండో కోవకు చెందిన అధికారే ప్రస్తుత ఎస్పీ అఖిల్ మహాజన్ అనే చర్చ పోలీస్‌శాఖలో మొదలైంది. ఎందుకంటే.. గతంలో ఆయన పని చేసిన ఆయా జిల్లాల్లో వ్యవహరించిన తీరు తెలుసుండడంతోనే ఈ చర్చ సాగుతోంది. ఇప్పటికే ఆయన తన పంథాలో పరిశీలన మొదలు పెట్టారని శాఖలో చెప్పుకొంటున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా ఎస్పీగా వ్యవహరించిన తరుణ్ జోషి లాగే విధుల్లో నిక్కచ్చిగా ఉంటారని అంటున్నారు. అటు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ సివిల్ పోలీసులపై దృష్టి సారిస్తూనే.. మిగతా విభాగాలపై కూడా ఫోకస్ పెట్టారనే ప్రచారం జరుగుతోంది. మొత్తంగా ఆయన సూక్ష్మ పరిశీలన తర్వాత జిల్లా పోలీస్‌శాఖలో ప్రక్షాళన ఉంటుందని భావిస్తున్నారు.

**జిల్లాపై పట్టు సాధిస్తూ..**

ఇక్కడ పని చేసిన ఎస్పీ గౌస్ ఆలం కరీంనగర్ సీపీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో ఈనెల 10న అఖిల్ మహాజన్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ శాఖపై తనదైన శైలిలో పట్టు సాధిస్తున్నారు. జిల్లా అంతటా విస్తృతంగా పర్యటిస్తున్న ఆయన ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి స్థితిగతులపై ఆరా తీస్తున్నారు. క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్ల పనితీరును నిశితంగా పరిశీలిస్తున్నారు. నేరాలను అదుపు చేసేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన రోజే ఆయన విలేకరుల సమావేశంలో రౌడీ షీటర్లకు హెచ్చరిక జారీ చేశారు. ప్రధానంగా ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో అధికసంఖ్యలో రౌడీషీటర్లు ఉండడంతో వారిని పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు తనవద్ద బెత్తం ఉందని చెప్పకనే చెబుతున్నారు.

**ప్రక్షాళన దిశగా..**

పోలీస్ శాఖలో ప్రక్షాళన దిశగా కొత్త ఎస్పీ దృష్టి సారించారనే చర్చ సాగుతోంది. ప్రధానంగా సివిల్ పోలీసులతో పాటు ఏఆర్, ఎస్‌బీ, డీపీవో, చివరకు హోంగార్డుల వ్యవస్థలోనూ మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే క్యాంప్ కార్యాలయంలో అదనంగా ఉన్న హోంగార్డులను అవసరమైన చోటికి తరలించారని సమాచారం. అంతేకాకుండా మినిస్టీరియల్ స్టాఫ్ పరంగా జిల్లాకు ఆయువుపట్టు లాంటి జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీవో)లో వ్యవస్థను పూర్తిస్థాయిలో చక్కదిద్దేందుకు ఇప్పటికే ఆయన దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇలా పరిశీలించి.. అలా మార్పులు చేయడం తన పద్ధతి కాదని, వ్యవస్థను గాడిలో పెట్టాలంటే మార్పులు చేసేందుకు వెనుకాడనని ఆయన పోలీసుల వద్ద అన్నట్లు సమాచారం. మొత్తంగా కొద్దిరోజుల తర్వాత ఎస్పీ మార్క్ జిల్లాలో కనిపిస్తోందని నలుగురు కలిసినచోట చెప్పుకొంటున్నారు.

## హమాలీలకు లైసెన్స్‌లు జారీ చేయాలి

కైలాస్‌నగర్: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేసే హమాలీలకు కొత్తగా లైసెన్స్‌లు జారీ చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హమాలీల సమస్యలు, లైసెన్స్‌ల జారీ ప్రక్రియపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో శనివారం పాలకవర్గాల సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. హమాలీల లైసెన్స్‌లకు సంబంధించి ఈ నెల 24న నోటిఫికేషన్ జారీ చేయాలని, 29వ వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. దరఖాస్తుదారులకు లైసెన్స్‌లను జారీ చేసే ముందు ఏప్రిల్ 2నుంచి 5వ తేదీ వరకు స్కిల్ టెస్ట్ నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. కమిటీలో జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, గుడిహత్నూర్ పీఏసీఎస్ సీఈవో, ఆదిలాబాద్ ఆర్డీవో, ఉట్నూర్ సబ్ కలెక్టర్ సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కమిటీ నిబంధనల ప్రకారం లైసెన్స్‌లు జారీచేసేలా చూడాలని సూచించారు. లైసెన్స్‌లు జారీ చేసే బాధ్యతలు సంబంధిత మార్కెట్ సెక్రటరీలకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఇందులో అక్రమాలు జరిగితే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, డీఎస్వో మోహన్, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధతతో విధులు నిర్వహించాలి



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ పోలీస్ నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్, మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎస్పీకి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వాహనాల గురించి ఆరా తీశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై చార్జ్‌షీట్ దాఖలు చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించారు. ప్రజలకు సకాలంలో సేవలందించినప్పుడే పోలీస్ వ్యవస్థ కీర్తి, ప్రతిష్ఠలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య గురించి అధికారులను అడిగి తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. అనంతరం మహిళా పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ.. మహిళల సమస్యలు త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు సునీల్‌కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు అశోక్, పద్మ, ఇసాక్, సిబ్బంది ఉన్నారు.

## అటవీ సంరక్షణ అందరి బాధ్యత

ఆదిలాబాద్‌టౌన్: వివిధ రకాల సంపదతో గిరిజనులకు జీవనోపాధి కల్పిస్తున్న అడవిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎఫ్‌ఆర్‌వో గులాబ్‌సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ఆయన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవిలో నివాసముండే గిరిజనులకు అక్కడే జీవనోపాధి దొరుకుతుందని చెప్పారు. అడవిలో నిప్పు చెలరేగినా.. ఎవరైనా చెట్లు నరికినా.. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఇంటికి ఐదు మొక్కల చొప్పున నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రమోద్ కుమార్, సెక్షన్ ఆఫీసర్లు అహ్మద్‌ఖాన్, గులాబ్, ధన్‌సింగ్, మొహబ్బత్ రావు, బీట్ ఆఫీసర్లు సవిత, జ్యోతి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న గులాబ్‌సింగ్

## సికిల్‌సెల్‌ను అంతం చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: సికిల్‌సెల్‌ను పూర్తిగా అంతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో సికిల్‌సెల్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికిల్‌సెల్ వ్యాప్తి, కట్టడి తదితర విషయాలను ప్రొజెక్టర్ ద్వారా మెడికల్ ఆఫీసర్లకు వివరించారు. సికిల్‌సెల్, ఎనీమియాతో అనేక మంది బాధపడుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోషకాల గురించి వైద్యులకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. వారు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. 2047 వరకు రాష్ట్రంలో సికిల్‌సెల్, ఎనీమియా లేకుండా చేయడంలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సికిల్‌సెల్‌తో కణాలు రక్త సరఫరాకు అడ్డంకిగా మారుతాయని చెప్పారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ఉందని తెలిపారు. కేరియర్‌లో ఎలాంటి లక్షణాలుండవని, ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కౌన్సిలింగ్ ఇస్తే వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, ఏటీడీవో అనిల్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఆర్‌ఎం(వో)గా శ్రీహర్ష

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం (ఆపరేషన్స్)గా డీ శ్రీహర్ష శుక్రవారం జిల్లా కేంద్రంలోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు కోదాడ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఆయన ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇప్పటివరకు డిప్యూటీ ఆర్‌ఎం(వో) విధులు నిర్వర్తించిన ఎస్.ప్రణీత్ డిప్యూటీ ఆర్‌ఎం (మెయింటెనెన్స్)గా విధులు స్వీకరించారు.



శ్రీహర్ష ➤

## క్లుప్తంగా

### 23న రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

**భైంసాటౌన్:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 23న పూర్వ ఆదిలాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెస్రం బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. గతప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతోపాటు రెవె న్యూ సంఘాల వైఫల్యంతో రెవెన్యూశాఖ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. అన్నిశాఖలను భా గస్వామ్యం చేసుకుని పనిచేసే రెవెన్యూ శాఖ ను పరిరక్షించుకునేందుకు టీజీఆర్ఎస్ఏ కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెవె న్యూ ఉద్యోగుల మధ్య ఐక్యత, ఆత్మీయ తను పెంపొందించేందుకు రాష్ట్ర నాయకత్వం లో రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పా టు చేస్తోందన్నారు. కాగా మంచిర్యాల లో పూర్వ ఆదిలాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యో గుల ఆత్మీయ సమ్మేళనానికి జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

### 23న ప్రజాఫ్రంట్ మహాసభలు

**బెల్లంపల్లి:** తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మూడో మహాసభలను ఈనెల 23న మంచిర్యాలలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ టి. జైపాల్‌సింగ్, ప్రజాకళామండలి జిల్లా అధ్యక్షుడు ఆడేపు సమ్మయ్య తెలిపారు. శుక్రవారం బెల్లంప ల్లిలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభ లకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కాంగ్రె స్ ప్రభుత్వం ఏడాదిలో బీఆర్ఎస్‌ను మించి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని మండిపడ్డారు. కాగా మంచిర్యాల చార్వాక ట్రస్ట్ భవన్‌లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ప్రజాఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ ఆర్.నాగభూషణం, రాష్ట్ర కోక న్వీనర్‌లు సంజీవరావు, అంబన్న హాజరవు తారని వివరించారు. కార్యక్రమంలో ప్రజా ఫ్రంట్ నాయకులు బోగే పోశం, జాడి చం ద్రయ్య పాల్గొన్నారు.

### బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జైలు

**ఖానాపూర్:** బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జైలుశిక్ష పడినట్లు ఎక్సైజ్ సీఐ రంగ స్వామి, ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణానికి చెందిన ఆగుట్ల పద్మ గతంలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా ఆమెపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయినా తీరు మార్చుకోకుండా బైండోవర్ ఉల్లంఘించి మళ్లీ నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. దీంతో తహసీల్దార్ సుజాత ఎదుట హాజరు పర్చగా పద్మను రెండు సంవత్సరాల జైలుశిక్ష కోసం రిమాండ్‌కు పంపాలని ఆదేశించారు. దీంతో ఎకై ్సజ్ అధికారులు ఆమెను ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

### ఐచర్‌వ్యాన్, బైక్ ఢీ

**భీమారం:** మంచిర్యాల –చెన్నూరు జాతీయర హదారిపై భీమారం సమీపంలో జోడు వాగుల మూలమలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్వేత తెలిపిన వివ రాల ప్రకారం... చెన్నూరు నుంచి మం చిర్యాల వైపు వెళ్తున్న బైక్ మంచిర్యాల నుం చి చెన్నూరు వైపు వెళ్తున్న ఐచర్‌వ్యాన్‌లు ఎదు రెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్ పై ప్రయా ణిస్తున్న మంచిర్యాలకు చెందిన ఆఖీల్‌ఖాన్, మధుకర్‌లకు బలమైన గాయాలయ్యాయి. మూలమలుపు వద్ద అధికవేగంతో వెళ్లడంతో ప్రమాదం జరిగిందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.



# యువతకు బాసట

- రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టిన సర్కారు
- రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు సబ్సిడీ రుణాలు
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



సిరికొండ: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేస్తున్న యువకులు

**నిర్మల్‌చైన్‌గేట్/సిరికొండ:** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. స్వయం ఉపా ధి యూనిట్లు నెలకొల్పుకొని తమ కాళ్లపై తాము నిలబడి తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చుకు నేందుకు యువతకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించిం ది. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఈ పథకం అమలు చేయనున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 4,200 మందికి ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందించనున్నారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,600 మంది యువతీ, యువకులకు ఈ పథకం కింద లబ్ధిచేకూరనుంది.

**మూడు కేటగిరీల్లో ఆర్థిక సహాయం..**

కేటగిరీ– 1, 2, 3 వారీగా యువతకు ఆర్థిక సహాయం అందించనున్నారు. కేటగిరీ –1 కింద రూ. లక్ష ఆర్థిక సహాయం అందిస్తారు. ఇందులో 80 శాతం సబ్సిడీని ప్రభుత్వం సమకూర్చుతుంది. 20 శాతం నగదును లబ్ధిదారులు సమకూర్చు కోవాల్సి ఉంటుంది. కేటగిరీ –2 కింద రూ. లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఆర్థిక సహాయం అం దిస్తారు. ఇందులో 70 శాతం సబ్సిడీ ఇవ్వనుండగా మిగితా 30శాతం లబ్ధిదారులు సమకూర్చుకోవాలి. కేటగిరీ 3 కింద రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తారు. ఇందులో 60 శాతం ప్రభుత్వమే సబ్సిడీ సమకూర్చనుండగా లబ్ధిదారులు 40శాతం భరించాల్సి ఉంటుంది. కేటగిరీ –1 కింద సహాయం పొందదల్చుకున్న వారు రూ. 20వేలు, కేటగిరీ –2 కింద సహాయం పొందదల్చుకున్నవారు రూ. 30వేల వరకు, కేటగిరీ 3 కింద సహాయం పొందదల్చినవారు రూ. 40వేల వరకు తమ వంతు పెట్టుబడిని స్వయంగా కానీ బ్యాంకుల నుంచి కానీ సమకూర్చుకోవాల్సి ఉం టుంది. తెలంగాణ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు తాము నెలకొల ్పదల్చుకున్న యూనిట్లకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పించాల్సి ఉం టుంది. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత సంబం ధిత కార్పొరేషన్లతోపాటు కలెక్టర్ పర్యవేక్షణలో మండల స్థాయిలోని అధికారుల కమిటీ లబ్ధిదారు లను ఎంపిక చేసి తుది జాబితాను ప్రకటిస్తుంది.

**ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ..**

రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం అమలులో భాగంగా మార్చి 17న దరఖాస్తుల స్వీకర ణను ప్రారంభించింది. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించ నున్నారు. ఆర్థిక సహాయం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీ యువకులు చేస్తున్న దరఖాస్తులను ఏప్రిల్ 6 నుంచి మే 31వరకు పరిశీలించి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని నిర్ణ యించారు.

**మంజూరులో జాప్యం..**

గత ప్రభుత్వ హయాంలో రుణాల మంజూరులో జాప్యం జరగడంతో నిరుద్యోగ యువత నిరాశకు గురయ్యారు. అయితే వరుస ఎన్నికలు వచ్చిన స మయంలో ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుం దని ఆశించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రు ణాల మంజూరు ఉంటుందనుకున్నారు. కానీ వరు స ఎన్నికల నేపథ్యంలో రుణాలకు బ్రేక్ పడింది.

**దరఖాస్తు చేసుకునేందుకు అర్హతలు..**

- తెలంగాణకు చెందిన స్థిరనివాసై ఉండాలి.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గానికి చెందిన వారై ఉండాలి.
- నిరుద్యోగ యువతీయువకులకు మాత్ర మే అవకాశం ఉంటుంది.
- ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతాల వివరాలు సమర్పిం చాలి.
- రేషన్‌కార్డు, ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ లో పేరు నమోదై ఉండాలి.

## శిలాజాలు తరలిస్తున్న వాహనం అడ్డగింత

**వేమనపల్లి:** శిలాజాలను తరలిస్తున్న వాహనాన్ని తహసీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డుకు న్నారు. ప్రాణహిత నది తీరంలో వేల ఏళ్ల నాటి నత్త గుల్ల, తాబేలు, చేప ఆకృతిలోని శిలాజరాళ్లు ఉన్నాయి. శిలాజాలను ఎవరో వాహనంలో తరలిం చడం గమనించిన స్థానికులు తహసీల్దార్‌కు సమా చారం అందించారు. వెంటనే ఆయన ఆర్ఐ ఖాలీక్‌ను సుంపుటం సమీపంలో ఉన్న ప్రాణహిత నదికి పంపి తహసీల్దార్ కార్యాలయానికి వాహ నాన్ని తరలించారు. శిలాజాన్ని తీసుకెళ్తున్న వ్యక్తిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను ఆర్కియా లజిస్ట్ శాఖకు చెందిన ఉన్నతాధికారులతో ఫోన్ మాట్లాడించాడు. శిలాజరాళ్లను భద్రపర్చేందుకు తీసుకెళ్తున్నట్లు నిర్ధారించుకుని వాహనాన్ని వదిలిపెట్టారు.



వాహనంలో తరలిస్తున్న శిలాజాలు

## బోరిగాంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ పర్యటన

**లక్ష్మణచాంద:** తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు మామడ, లక్ష్మణచాంద మండలాల పరిధిలోని బోరిగాం గ్రామంలోని గోదాములను శుక్రవారం సందర్శించారు. ఈ సం దర్భంగా గోదాం నిల్వ సామర్థ్యం, వేబ్రిడ్జి సామ ర్థ్యం, రికార్డుల పరిశీలన చేసి మేనేజర్ శివరామకృ ష్ణకు పలు సూచనలు చేశారు. బీహార్ హమాలీలతో మాట్లాడి వారికి కల్పించిన మౌలిక సదుపాయాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బం దితో కలిసి గోదాంలో మొక్క నాటారు. గోడౌన్‌లో బాగా కష్టపడే వారిని గుర్తించి వారికి తగిన గుర్తిం పు ఇస్తామన్నారు. అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదన్నారు. పర్యటనకు ముందు నిజామాబాద్ రీజియన్ పరిధిలోని మేనేజర్‌లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ కోర్రా లక్ష్మి, జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్.సి శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్, ఆర్ఎం రాజ్యలక్ష్మి, గోడౌన్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



బోరిగాంలో మాట్లాడుతున్న నాగేశ్వర్ రావు

## బడుగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**దండేపల్లి:** బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర గిరిజన అభివృద్ధి సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలం ధర్మరావు పేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు, దండేపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిర మ్మ మోడల్‌హౌజ్ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్ర భుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తుందన్నా రు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీ డీవో ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సతీశ్, నాయకులు రాంచందర్, దుర్గప్ర సాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న తిరుపతి

### ఎల్‌ఎండీ సమీపంలోని కాలువలో విద్యార్థి గల్లంతు

**జన్నారం:** మండలంలోని చింతలపల్లి గ్రామా నికి చెందిన యువకుడు ఎల్‌ఎండీ సమీపంలో ని కాలువలో గల్లంతు కావడంతో గ్రామంలో విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. గ్రామ స్తుల వివరాల ప్రకారం చింతలపల్లి గ్రామానికి చెందిన వాసాల లింగన్న, శంకరవ్వల కుమా రుడు అరవింద్ (18) కరీంనగర్‌లోని ఎస్సార్ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నా డు. ఈనెల 19న స్నేహితులతో కలిసి ఎల్‌ఎం డీలో సమీపంలోని కాలువలోకి స్నానం కోసం వెళ్లి గల్లంతయ్యాడు. కాగా హుజురాబాద్ మం డలం తుమ్మనపల్లి కేసీ కెనాల్‌లో శుక్రవారం అతని మృతదేహం లభ్యమైంది. మృతదేహా న్ని స్వగ్రామానికి తీసుకొస్తున్నట్లు యువకుడి బంధువులు తెలిపారు.

### వేద పాఠశాల విద్యార్థికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న బాలుడు

**భైంసాటౌన్:** బాసరలోని వేద పాఠశాలకు చెం దిన లోహిత్(11) అనే విద్యార్థి తీవ్ర గాయాల తో భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి పాలయ్యా డు. విద్యార్థి తల్లి రాధిక కథనం ప్రకారం.. తూ ప్రాన్‌కు చెందిన రాధిక –ఆంజనేయులు దంప తుల కుమారుడు లోహిత్ మూడేళ్లుగా బాసర లోని వేద పాఠశాలలో వేదవిద్య అభ్యసిస్తున్నా డు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పాఠ శాల నిర్వాహకులు బాలుడు తీవ్ర గాయాలపా లైనట్లు ఫోన్‌లో తల్లిదండ్రులకు సమాచా ర మిచ్చారు. దీంతో వారు సాయంత్రం ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం బాలుడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు తల్లి రాధిక తెలిపారు. కా గా గాయాలకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## కుటుంబ తగాదాల్లో వ్యక్తి మృతి



లక్ష్మణ్ (ఫైల్)



పంచనామా చేస్తున్న సీఐ కుమారస్వామి

**భీమిని:** మండలంలోని వెం కటపూర్ గ్రామ పంచాయ తీలో కుటుంబ తగాదాల్లో మామ, బావమరిది దాడి చేయడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసు లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటపూర్ గ్రామానికి చెందిన చదువుల లక్ష్మణ్ (35) మద్యానికి బానిస య్యాడు. తరచూ భార్య రోజ అలియాస్ సమతతో గొడవ పడేవాడు. శుక్రవారం కూడా భార్యతో తీవ్ర స్థాయిలో గొడవపడ్డాడు. ఈక్రమంలో రోజ తండ్రి పార్వతి రాజేశం, తమ్ముడు పార్వతి అనిల్‌లు లక్ష్మణ్‌పై దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలైన లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమారస్వామి, ఎస్సై గంగారాం తెలిపారు.

### పిచ్చికుక్కల దాడి.. చిన్నారులకు గాయాలు

**ఉట్నూర్‌రూరల్:** మండలంలోని లక్కారం గ్రామం లో పిచ్చికుక్క ఇద్దరి చిన్నారులను గాయపర్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మరికంటి రుద్రాన్స్, అలిశెట్టి నిత్యాన్ష ఇ ద్దరు చిన్నారులు శుక్రవారం ఇంటి ముందు ఆడు కుంటుండగా పిచ్చికుక్క వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. చిన్నారులు కేకలు వేయడంతో వెం టనే స్థానికులు, త ల్లిదండ్రులు అప్రమత్తమై కుక్కను తరిమేశారు.

### వివాహిత అదృశ్యం

**ఆదిలాబాద్‌రూరల్:** మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన వివాహిత సోయం వెంకటమ్మ అదృశ్యమైనట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వివాహి త వెంకటమ్మ భర్త క్రిష్ణ కుమార్‌తో గొడవపడి గురువారం మధ్యా హ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతకగా ఎక్కడా లభించలేదు. దీంతో భర్త క్రిష్ణకుమార్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బాసరలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజ చేస్తున్న అర్చకులు

**బాసర:** నిర్మల్ జిల్లా బాసరలో బ్రహ్మశ్రీ శ్రౌతి రాజేశ్వరి శర్మ –సునీత దంపతులు మహారుద్ర సహిత అష్టోత్తర శత సువాసిని సమారాధన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. శుక్రవారం ఆలయ అర్చకులు, వేదపం డితుల ఆధ్వర్యంలో శ్రీ జ్ఞానసరస్వతి, మహం కాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అర్చ న పూజలు నిర్వహించారు. అనంతరం గురు ప్రార్థన ఉత్సవ సంకల్పం, 108 మంది బ్రాహ్మ ణోత్తములతో 1331 రుద్ర పారాయణం, 1000 శ్రీ సూక్తాపారాధనలు జరిపించారు. నా ట్యమండలి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యం లో చిన్నారులతో భరతనాట్య ప్రదర్శన నిర్వ హించగా, తొగుట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి హాజరయ్యారు. వీరికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. వివి ధ ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణోత్తములతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నేడు 108 సువాసినీ సమారాధన కార్యక్రమం, స్వామి వారి పాదపూజ మొదలగు కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు శ్రౌతి రాజేశ్వర శర్మ తెలిపారు.

## ట్రిపుల్‌ఐటీలో టెక్‌ఫెస్ట్

**బాసర:** బాసర ట్రిపుల్‌టీలో శుక్రవారం అంతఃప్రజ్ఞ టెక్‌ఫెస్ట్, 2025 ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మాన్ని ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ఎ.గోవర్ధన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకత, ఆవిష్కరణలను అన్వేషించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీని దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా మారుస్తామని పేర్కొన్నారు. ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ ఈ టెక్‌ఫెస్ట్ విద్యార్థుల ప్రతిభకు నిలయమని ప్రశంసించారు. ఈసందర్భంగా విద్యా ర్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో ప్రొఫెసర్లు మురళీధర్షన్, రణధీర్ సాగి, విట్టల్, మహేశ్, చంద్రశేఖర్, అజయ్, రాములు, స్వప్నిల్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.




జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

**యాక్టివిటీ సెంటర్ ప్రారంభం..**

బాసర ట్రిపుల్ ఐటీలో యాక్టివిటీ సెంటర్‌ను శుక్ర వారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ పురుషోత్తం, ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ ప్రారంభిం చారు. విద్యార్థుల సంక్షేమం, పాఠ్యేతర కార్యక లాపాలను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలలో ఈ యాక్టివిటీ సెంటర్ మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థి కేంద్రీకృత చొరవల ప్రాముఖ్యతను వివరిస్తూ సమగ్ర విద్య అనుభవాన్ని అందించడంలో విశ్వ విద్యాలయం చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసిం చారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్టూడెంట్ యాక్టివి టీ సెంటర్ అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చే శామని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. విద్యార్థుల నైపు ణ్యాభివృద్ధి, నాయకత్వ అభివృద్ధి, సమాజ సేవను ప్రోత్సహించడం లక్ష్యమని పేర్కొన్నారు.

## విద్యార్థులకు వినికిడి పరికరాలు పంపిణీ

**ఉట్నూర్‌రూరల్:** మండల కేంద్రంలోని కేబీ ప్రాంగ ణంలో గల ఐటీడీఏ ఆశ్రమ వికాసం ప్రత్యేక పాఠ శాలలో శుక్రవారం ఆకృతి, హైదరాబాద్ సౌజన్యం తో గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా రూ.10 లక్షల విలువ గల వినికిడి పరిక రాలను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక కేబీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్ మండలాల పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలపై సమీక్ష నిర్వహించి, గిరిజన గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగం తీసుకోవాలన్నారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని హ్యాబిటేషన్ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. నీరు లేని గ్రామా లకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఈఈ తానాజీ, డీఈ శివప్రసాద్, డీఎల్ పీవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.



వినికిడి పరికరాలు పంపిణీ చేస్తున్న ఖుష్బూగుప్తా

## 'అధికారులు వేధింపులు మానుకోవాలి'



కాసిపేట 1గనిపై నిరసన తెలుపుతున్న కార్మికులు

**కాసిపేట:** అధికారులు వేధింపులు మానుకోవాలని శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై కార్మికులు మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి నిరసన తెలిపారు. కార్మికుల డిమాండ్ మేరకు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ యూనియన్‌లు నిరస నకు పిలుపునివ్వగా యూనియన్‌లకు సంబంధం లేకుండా కార్మికులు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. అధికారులు కార్మికు లను వేధిస్తూ చార్జ్‌షీట్లు, మెమోలు, సస్పెండ్‌లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ బెల్లంప ల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ కార్యదర్శి లక్ష్మినారాయణ, టీబీజీకేఎస్ నాయకులు భైరి శంక ర్, అఫ్జలోద్దీన్, బానోత్ తిరుపతి, రావుల సతీశ్ వర్మ, కార్మికులు పాల్గొన్నారు.

## వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

**పంట దిగుబడి రాక రైతు ఆత్మహత్య**



లింగన్న(ఫైల్)

**తలమడుగు:** పంట ఆశిం చిన దిగుబడి రాక, పెట్టు బడి కోసం చేసిన అప్పులు తీర్చేదారి లేక ఓ రైతు ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండ లం సుంకిడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుం ది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మం డలంలోని సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్నకు ఆరు ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఈ ఏడాది పత్తి, కంది పంటలు సాగు చేశాడు. గత రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం లేదు. పెట్టుబడి కోసం గ్రామం లోని గ్రామీణ బ్యాంకులో రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్నాడు. ఇతర ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.2 లక్షల వరకు అప్పు చేశాడు. ప్రభుత్వం ఇటీ వల ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ కాకపోవ డంతో మరింత ఆందోళనకు గురయ్యాడు. కుటుం బ పోషణ భారమై, అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. శుక్రవారం పొలానికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. అక్కడే లింగన్న(48) చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు వంశీ, శరత్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అంజమ్మ తెలిపారు.

**వేధింపులు తాళలేక వ్యక్తి..**



గుండ్ల ప్రకాశ్ (ఫైల్)

**రెబ్బెన:** ఇచ్చిన డబ్బులు అడగటమే తన పాలిట శాపంగా మారింది. తీసు కున్న డబ్బులు ఇవ్వకపోగా తనకే డబ్బులు ఇవ్వాలని లేకుంటే కేసులు పెడతానని ఓ వివాహిత మహిళతో పాటు కొంతమంది నాయకులు వేధించడంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గంగాపూర్‌లో చోటు చేసుకుంది. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివ రాల ప్రకారం.. గంగాపూర్ గ్రామానికి చెందిన గుం డ్ల ప్రకాశ్ (53) గంగాపూర్ గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెం దిన గుర్లె సోనీ అనే వివాహిత ప్రకాశ్‌కు మద్యం అలవాటు చేయడంతో పాటు అప్పుడప్పుడూ ప్రకాశ్ వద్ద నుంచి అవసరానికి డబ్బులు తీసుకు నేది. కొన్ని నెలల క్రితం సోనికి ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని ప్రకాశ్ కోరగా నిరాకరించడంతో పాటు తనకే రూ.లక్ష బాకీ ఉన్నావని ఎప్పుడు ఇస్తా వంటూ వేధించింది. డబ్బులు ఇవ్వకుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరింపులకు పాల్పడింది. సోనికి మద్దతుగా గ్రామానికి చెందిన పలువురు నాయకులు డబ్బులు చెల్లించాలంటూ వేధించడంతో ప్రకాశ్ గురువారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. శుక్రవారం తెల్లవారుజామున గమనించిన గ్రామస్తులు బెల్లం పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యు లు పరీక్షించి అప్పటికే ప్రకాశ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రాకేశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**ఉరేసుకుని యువకుడు..**

**రామకృష్ణాపూర్:** పట్టణంలోని ఏజోన్ రామ్‌నగర్ ఏరియాకు చెందిన అల్లకొండ శ్రీకాంత్(32) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ స్థానిక ఓ కన్స్‌స్ట్రక్షన్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. డబ్బుల లావాదేవీలకు సంబంధిం చి ముగ్గురు వ్యక్తులు వేధించడంతో భరించలేక తనువు చాలిస్తున్నట్లు సూసైడ్‌నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన జరిగిన సమయంలో ఇం ట్లో ఎవరూ లేరని కుటుంబసభ్యులు శుక్రవారం ఇంటికి వచ్చి తలుపులు తెరిచి చూడగా ఆత్మహత్య ఘటన బయటకు వచ్చిందని ఎస్సై తెలిపారు. కాగా మృతుడి భార్య కరోనా సమయంలో మృ తిచెందగా ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.